ఆందోళనలో రైతులు


ఫ్లవరింగ్ దశలో ఉన్న ఆడ, మగ వరి పంట


పీచు దశలో ఉన్న మొక్కజొన్న పంట

వాతావరణ మార్పుతో ఆడ, మగ వరి పంటపై ప్రభావం

- వడగళ్ల వర్షం పడితే వరి, మొక్కజొన్న పంటలకు నష్టం

టేకుమట్ల: రెండు రోజులుగా వాతావరణంలో మార్పు చోటు చేసుకోవడంతో పాటు శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి ఆడ, మగ వరి పంటపై తీవ్ర ప్రభావం చూపించిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో యాసంగిలో 6600 ఎకరాల్లో వరి, 3700 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నారు. కాగా వరి పంటల్లో ఆడ, మగ పంటను ఎక్కువ మంది రైతులు సాగు చేస్తున్నారు. రెండు రోజులుగా ఎండ తీవ్రత తగ్గడంతో పాటు, పూవు దులిపే సమయంలో వర్షం కారణంగా సీడ్ వరి పంటలో ఫ్లవరింగ్ తగ్గడంతో పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పొట్టదశలో ఉన్న వరికి తీవ్ర నష్టం

పొట్టదశలో ఉన్న వరి పంటపై వడగళ్ల వర్షం కురిస్తే పొట్ట పగలడం, వరి గొలుసు సైతం వంగే అవకాశం ఉంది. పొట్టపగిలినా, గొలుసు వంగినా పంట గింజ పూర్తిస్థాయిలో వృద్ధి చెందక ఆగిపోతుంది. అలాగే మొక్కజొన్న పంట సైతం పీచు దశలో, కొన్ని చోట్ల కోత దశలో ఉండగా వర్షం కురిస్తే పంట నేలవాలే పరిస్థితి ఉందని రైతులు వాపోతున్నారు. దీంతో ఇప్పటి వరకు పెట్టిన పెట్టుబడి సైతం వచ్చే అవకాశం కూడా లేదని దిగులు చెందుతున్నారు. పంట చేతికొచ్చే సమయంలో వాతావరణంలో మార్పు రావడంతో రైతుల ఆవేదన చెందుతున్నారు.

మూడెకరాల్లో వరి సాగు చేశా..



మూడెకరాల్లో ఆడ, మగ వరి పంట వేశాను. ఇప్పుడు ఫ్లవరింగ్ సీజన్ వర్షం వస్తే ఫ్లవరింగ్ రాక, పూర్తిగా నిలిచిపోతుంది. రెండు రోజులుగా వాతావరణం చల్లబడడంతో ఫ్లవర్ డస్ట్ రాకపోవడంతో పంటపై ప్రభావం చూపిస్తుందని భయమేస్తుంది. పంటలో ఫ్లవరింగ్ దశ కీలకమైంది. వాతావరణం ఇలా ఉంటే నష్టాలు తప్పవు.

– తిప్పనవేని బాలు, రైతు, టేకుమట్ల

మొక్కజొన్న సాగు చేస్తున్నా..



యాసంగిలో మూడెకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నా. మూడెకరాల్లో ఎకరం లోకల్ మొక్కజొన్న, రెండెకరాల్లో ఆడ, మగ మొక్కజొన్న పంటలను సాగు చేస్తున్నా. లోకల్ మొక్కజొన్న పంట పీచు దశలో ఉంది. ఇప్పుడు గాలితో కూడిన వర్షం వస్తే పడిపోయే ప్రమాదం ఉంది. మొక్క పడిపోతే కంకి ఎదుగుదల కూడా నిలిచిపోతుంది.

– మేకల సదయ్య, రైతు, అంకుషాపూర్

క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే రాక

రేగొండ: మండలంలోని కొడవటంచ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం సమీపంలోని టూరిజం గెస్ట్ హౌస్‌ను ప్రారంభించడానికి నేడు (ఆదివారం) ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు రానున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇప్పకాయల నర్సయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మహిళా దినోత్సవం



భూపాలపల్లి అర్బన్: ఏరియా సింగరేణి లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఇల్లందు క్లబ్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించినట్లు ఏరియా అధికార ప్రతినిధి మారుతి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాలతి సూర్యనారాయణ, విజయలక్ష్మీవెంకటేశ్వర్లు హాజరై కేక్ చేసి మహిళల గొప్పతనం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏరియా సేవా సమితి అధ్యక్షురాలు సునీతరాజేశ్వర్‌రెడ్డి, లేడీస్‌క్లబ్, సేవా సమితి మహిళలు పాల్గొన్నారు.

మండల అధ్యక్షుడిగా శ్రీకాంత్



రేగొండ: బహుజన్ సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడిగా ఇంజంపల్లి శ్రీకాంత్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు పొన్నం భిక్షపతి తెలిపారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బహుజనులు రాజ్యాధికారం దిశగా కృషి చేయాలని పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల నుంచి పోటీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మేకల ఓంకార్, జిల్లా ట్రెజరర్ కొయ్యడ రాజు, మడతపల్లి బూత్ అధ్యక్షుడు కొయ్యాడ స్వామితో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లలో అవకాశం కల్పించాలి

మల్హర్: వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇందిరమ్మ ఇళ్లలో ప్రభుత్వం అవకాశం కల్పించాలని జాతీయ బీసీ సంఘం జిల్లా ఇన్‌చార్జ్ విజయగిరి సమ్మయ్య శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జర్నలిస్టులు అందరికీ హెల్త్ కార్డులు, ఇళ్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

సన్మానం



చిట్యాల: మండలంలోని జూకల్ గ్రామానికి చెందిన కవి రచయిత మ్యాదరి సునీల్‌ను ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా వరల్డ్ పీస్ సొసైటీ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం హనుమకొండలో నిర్వహించిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. సునీల్ ప్రపంచానికి కవులు ఏమవుతారు అనే అంశంపై పాటను రాశారు. దీంతో అతడి ప్రతిభను గుర్తించిన సంస్థ అధ్యక్షుడు సిరాజుద్దీన్ వరంగల్ సైబర్‌క్రైం ఏసీపీ విజయ్‌కుమార్, ఆచార్య రవికుమార్ చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందించి ఘనంగా సన్మానించారు.

ఒకరిపై కేసు

రేగొండ: టేకు చెట్లు నరికిన ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్ కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన నామని రమేశ్ అతడికి ఉన్న ఐదు ఎకరాల వ్యవసాయ భూమి గట్టు మీద టేకు చెట్లను పది సంవత్సరాల నుంచి సాగు చేస్తున్నాడు. కాగా, అతడి భూమి పక్కన ఉన్న చల్ల ఉపేందర్ టేకు చెట్లు కరెంటు తీగలకు అడ్డువస్తున్నాయని నరికివేశాడు. దీంతో బాధిత రైతు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి


రాజు (ఫైల్)

రేగొండ: మండలంలోని రంగయ్యపల్లి గ్రామానికి చెందిన బలుగూరి రాజు (30) గత నెల 24న ఆటోలో పరకాలకు వెళ్తుండగా టాటాఏస్ వాహనం అదుపుతప్పి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ రాజుకు తీవ్ర గాయాలు కాగా మెరుగైన చికిత్స కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతుడికి భార్య పూజ ఉంది.

పొంచి ఉన్న ప్రమాదం



చిట్యాల మండలంలోని శాంతినగర్‌కు వెళ్లే ప్రధాన రోడ్డు వెంట ఎండిన చెట్టు ప్రమాదకరంగా ఉంది. గాలిదుమారానికి ఎప్పుడు పడుతుందో తెలియని పరిస్థితి. నిత్యం ఆ రోడ్డు వెంట వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగిస్తుంటారు. సంబంధిత అధికారులు స్పందించి ఎండిన చెట్టును తొలగించి ప్రయాణికులకు ప్రమాదం జరుగకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

– చిట్యాల

పరీక్ష కేంద్రం తనిఖీ

రేగొండ: మండలంలో పదో తరగతి పరీక్షలు శనివారం రెండో రోజు కొనసాగాయి. రేగొండలో 180 మంది, రంగయ్యపల్లిలో 117 మంది విద్యార్థులు హాజరయ్యారు. మండల కేంద్రంలోని పరీక్ష కేంద్రాన్ని జిల్లా స్థాయి అబ్జర్వర్ సోమిరెడ్డి తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సబ్సిడీపై యంత్రాలు

రేగొండ/మొగుళ్లపల్లి: ఐదు ఎకరాల కన్నా తక్కువ భూములు ఉన్న మహిళ రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద వివిధ వ్యవసాయ యంత్ర పరికరాలు అందించనున్నట్లు రేగొండ, కొత్తపల్లిగోరి, మొగుళ్లపల్లి మండలాల వ్యవసాయ అధికారులు వాసుదేవరెడ్డి, సారయ్య, సురేందర్ రెడ్డి శనివారం వేర్వేరు ప్రకనటలో పేర్కొన్నారు. బ్యాటరీ స్ప్రేయర్లు, తైవాన్ స్ప్రేయర్లు, కల్టివేటర్లు, రోటవేటర్లు, పవర్ టిల్లర్లు, సీడ్ కమ్ ఫర్టిలైజర్ డ్రిల్ యూనిట్లు, గడ్డి కట్టలు కట్టే యంత్రం మంజూరైనట్లు తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 26 లోపు దరఖాస్తులు మండల వ్యవసాయ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

మంద కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

మల్హర్: ఎస్సీ వర్గీకరణ సాధించుకున్న నేపథ్యంలో మండల కేంద్రంలోని తాడిచర్లలో శనివారం మంద కృష్ణమాదిగ చిత్రపటానికి ఎమ్మార్పీఎస్ మండల నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో 30 సంవత్సరాలు రాజీలేని పోరాటం చేసి ముందుకు నడిపించిన మందకృష్ణ మాదిగకు మాదిగ సమాజం మొత్తం రుణపడి ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కేసారపు నరేష్, మండల ప్రధాన కార్యదర్శి తాండ్ర దినేష్, నాయకులు ఇందారపు సిద్ధు, ఇందారపు శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు


వెంకటాపురం(ఎం): చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ గిరిబాబు


ఎస్ఎస్‌తాడ్వాయి : చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు


వెంకటాపురం(ఎం): వేసవికాలంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు అని తహసీల్దార్ గిరిబాబు అన్నారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. అనంతరం గిరిబాబు మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పనుల కోసం వచ్చే ప్రజలు చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ విజేందర్, అధికారులు పాల్గొన్నారు.

నార్లాపూర్‌లో చలివేంద్రం ప్రారంభం

ఎస్ఎస్‌తాడ్వాయి : మండలంలోని నార్లాపూర్‌లో పంచాయతీ కార్యదర్శి ధర్మేందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. పార్టీ జిల్లా నాయకుడు తండాల శ్రీనివాస్ మాట్లాడుతూ వేసవి ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని పనుల నిమిత్తం నార్లాపూర్‌కు వచ్చే ప్రజల దాహం తీర్చేందుకు మంత్రి సీతక్క ఆదేశాల మేరకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు మొక్క శ్రీనివాస్, ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షుడు పురుషోత్తం నారాయణ, వెంకన్న, భిక్షపతి, వంశీ, సత్యం పాల్గొన్నారు.

రైతు కుటుంబాలను ఆదుకోవాలి

- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎండీ. అమ్జద్‌పాషా


మాట్లాడుతున్న అమ్జద్‌పాషా

ములుగు రూరల్ : జన్యుమార్పిడి మొక్కజొన్న విత్తనాలను సాగు చేసి దిగుబడి రాక అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడిన రైతు కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ.అమ్జద్‌పాషా డిమాండ్ చేశారు. శనివారం మొక్కజొన్న సాగు రైతులకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వెంకటాపురం(కె), వాజేడు, కన్నాయిగూడెం, ఏటూరునాగారం మండలాల్లో సుమారు 1300 ఎకరాల్లో కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకొని మొక్కజొన్న సాగు చేశారని అన్నారు. సిజెంట, బేయర్, కావేరి కంపెనీల యాజమాన్యాలు ఏజెన్సీలో గిరిజన రైతులను మోసం చేసి జన్యుమార్పిడి పంటలను సాగు చేసేవిధంగా ప్రోత్సహించడంతో దిగుబడి రాక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు


ఎమ్మెల్యే సత్యనారాయణరావును సన్మానిస్తున్న ముస్లిం మత పెద్దలు

రేగొండ: పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లింల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు మత సామరస్యానికి ప్రతీక అని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మజీద్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని మతాలు ఒకటేనని ప్రజలంతా సోదర భావంతో ఉండాలన్నారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ముస్లింలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ముస్లిం మత పెద్దలు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అబ్దుల్ రజాక్, భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టయ్య, పీఏసీఎస్ చైర్మన్ నడిపల్లి వెంకటేశ్వరరావు, జిల్లా, మండల నాయకులు నాయినేని సంపత్‌రావు, పుల్లూరి బాబురావు, పున్నం రవి, సూదన బోయిన ఓంప్రకాశ్, పట్టెం శంకర్, షాబీర్ అలీ, మైస భిక్షపతి, ముద్దమల్ల రవి, ప్రేమాజీ, ఓమాజీ, కోయిల క్రాంతి, తరుణ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

‘మైనింగ్ కళాశాల ఏర్పాటు చేయాలి’

భూపాలపల్లి: సింగరేణి పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చెందుతున్న భూపాలపల్లి పట్టణంలో మైనింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో వందేళ్ల నుంచి నేరేడుపల్లి, కొత్తపల్లి, జగ్గయ్యపేట, గోరికొత్తపల్లి, నిజాంపల్లి, గాంధీనగర్, జూబ్లీనగర్ తదితర గ్రామాల్లో సుమారు పది వేల ఎకరాల్లో భూములు దున్నుకుంటున్నారని తెలిపారు. వారికి పట్టాదారు పాసు బుక్కులు లేకపోవడం మూలంగా రైతు భరోసా, బీమా అందడం లేదన్నారు. వారందరికీ పట్టాదారు పుస్తకాలు అందజేసేలా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గణపురం రిజర్వాయర్, పంబాపూర్ చెరువు కింద ఉన్న కాలువలు మరమ్మతుకు నోచుకున్నాయని, శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టాలని కోరారు. టేకుమట్ల మండలంలోని బూర్నపల్లి వద్ద చలివాగుపై చెక్ డ్యాం నిర్మించి రైతులకు సాగునీరు అందేలా చూడాలని సత్యనారాయణరావు ప్రభుత్వాన్ని కోరారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


చిట్యాల: పరామర్శిస్తున్న వెంకటరమణారెడ్డి

చిట్యాల: మండలంలోని ఒడితల గ్రామానికి చెందిన మ్యాదరి సాంబలక్ష్మి, నలిమెల చంద్రయ్య, కొత్తపేటకు చెందిన మేకల చందు, జడలపేటకు చెందిన అడిదల సంజీవ రెడ్డి, రాంచంద్రాపూర్‌కు చెందిన సూర కుమారస్వామి ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి శనివారం పరామర్శించారు. అలాగే జడలపేట గ్రామానికి చెందిన మేరుగు సారంగపాణికి ఇటీవల ప్రమాదవశాత్తు కాలు విరగడంతో అతడిని పరామర్శించారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ గొర్రె సాగర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్, మాజీ వైస్ ఎంపీపీ నిమ్మగడ్డ రాంబాబు, నాయకులు దొడ్డి శంకర్, పిట్ట సురేష్, రాజు నాయక్, పులి వెంకటేశ్, తదితరులు ఉన్నారు.

కొత్తపల్లిగోరిలో..

రేగొండ: కొత్తపల్లిగోరి మండల కేంద్రానికి చెందిన పల్లెబోయిన దేవరాజు అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతిచెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను శనివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిశిధర్ రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, నాయకులు సూదనబోయిన విష్ణుయాదవ్, పుట్ట రాంగాగు, జోరు వీరేశం, బమ్మ రవీందర్, బాబురావు, వేణు, కిషన్, ఎర్రం రాకేశ్‌రెడ్డి ఉన్నారు.

మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ


మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

మొగుళ్లపల్లి: మొట్లపల్లి జెడ్పీఎస్ఎస్‌లో పదో తరగతి పరీక్షలు రాసి బయటికి వచ్చిన విద్యార్థులకు కాంగ్రెస్ పార్టీ గ్రామ మహిళా అధ్యక్షురాలు, అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ చిలుకూరి కరుణదేవేందర్ రెడ్డి శనివారం మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. డ్యాగ రమేష్, గూడూరి తిరుపతిరెడ్డి, జన్నె రవీందర్, వడ్డేపల్లి రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఎటు వెళ్లాలో తెలిసేదెలా?

- జగన్నాథపురం జంక్షన్ వద్ద ఏర్పాటు చేయని సూచిక బోర్డులు
- దారి తెలియక అయోమయానికి గురవుతున్న వాహనదారులు


సూచిక బోర్డులు లేని జగన్నాథపురం జంక్షన్

వాజేడు : దూరప్రాంతాల నుంచి వాజేడు మండలం మీదుగా భద్రాచలం, ఛత్తీస్‌గఢ్, మధ్య ప్రదేశ్, మహారాష్ట్ర వెళ్లాలనుకునే వాహనదారులు, అదే విధంగా ఆయా ప్రాంతాల నుంచి వరంగల్, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లాలనుకునే వారు జగన్నాథపురం జంక్షన్‌కు రాగానే అయోమయానికి గురవుతున్నారు. హైదరాబాద్, భూపాలపట్నం 163 నంబర్ జాతీయ రహదారి కావడంతో వేగంగా వచ్చిన వాహనదారులు అక్కడి రాగానే భద్రాచలం, ఛత్తీస్‌గఢ్ వైపు వెళ్లడానికి ఎలాంటి సూచిక బోర్డులు లేవు. ఎటు వెళితే ఏ ఊరుకు వెళతామో తెలియక అయోమయానికి గురవుతున్నారు. ఎవరినైనా అడుగుదామంటే అక్కడ నిర్మానుష్య ప్రదేశం కావడంతో ఎవరు ఉండరు.

ఖాళీగా ఉన్న సూచిక బోర్డులు

దూరప్రాంతాల నుంచి వచ్చే వారు వేరే రాష్ట్రానికి గానీ, ఊరుకు గానీ వెళ్లాలనుకునే వారు ముందుగా సూచిక బోర్డుపై ఏమి రాసి ఉందో చూసి అది ఏ ఊరు, ఇంకా ఎంత దూరం ఉందో గుర్తిస్తారు. అక్కడి నుంచి ఎటు వెళ్లాలో యారో మార్కుతో సూచిస్తూ ఉంటుంది. దాని ఆధారంగా ఆ ఊరుకు వాహనాల్లో వెళ్తుంటారు. ఎక్కడి నుంచే వచ్చే వాహనదారులు జగన్నాథపురం జంక్షన్ వద్దకు రాగానే అయోమయానికి గురవుతున్నారు. ఇక్కడ సూచిక బోర్డులపై ఎలాంటి రాతలు లేకపోవడంతో ఎవరైనా వచ్చే వరకు ఆగి వివరాలను తెలుసుకుని వెళుతున్నారు.


భద్రాచలం వైపు పేర్లు లేకుండా ఉన్న సూచికబోర్డు

బస్‌షెల్టర్‌లోని బల్లలు ఏమైనట్లు?

దూర ప్రాంతాల నుంచి వచ్చే వారు, బస్‌కోసం చూసే వారు అక్కడ కొంత సమయం వేసి ఉండాల్సి వస్తుంది. రహదారి నిర్మాణ సమయంలో జగన్నాథపురం జంక్షన్ వద్ద రహదారికి రెండు వైపులా బస్‌షెల్టర్లను ఏర్పాటు చేశారు. అందులో ప్రయాణికులు కూర్చోవడానికి వీలుగా ఐరన్ బల్లలు అమర్చారు. కొన్ని రోజులు అవి ఉన్నప్పటికీ ఆ తర్వాత మాయం అయ్యాయి. అవి ఎవరు తీసుకెళ్లారో తెలియదు. బల్లలు లేకపోవడంతో ప్రయాణికులు బస్, ఇతర వాహనాలు వచ్చే వరకు మండుటెండలో నిల్చోవాల్సి వస్తుంది.

బోర్డులపై పేర్లు రాయాలి



జాతీయ రహదారి కావడంతో దూరప్రాంతాల నుంచి వాహనదారులు వస్తుంటారు. వారికి ఏ ఊరికి వెళ్లాలో తెలియాలంటే సూచిక బోర్డుపై ఊర్ల పేర్లు ఉండాలి. అధికారులు తప్పని సరిగా సూచిక బోర్డులపై పేర్లు ఉండేలా చూడాలి.

– యాలం రామకృష్ణ, ప్రయాణికుడు

రామప్పలో విద్యార్థుల సందడి



వెంకటాపురం(ఎం): మండలంలోని చారిత్రాత్మక రామప్ప దేవాలయంలో శనివారం విద్యార్థుల సందడి నెలకొంది. వీకెండ్ కావడంతో విద్యార్థులు అధికసంఖ్యలో తరలివచ్చి రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. శనివారం రామలింగేశ్వరున్ని త్రిశూలం, ఓంకారం ఆకారంతో ప్రత్యేకంగా అలంకరించినట్లు ఆలయ ప్రదాన ఆర్చకుడు కోమల్లపల్లి హరీష్‌శర్మ తెలిపారు. రామప్ప ఆలయ విశిష్టత గురించి గైడ్ వెంకటేష్ విద్యార్థులకు వివరించారు.